

ఎమ్మెల్యే కార్యాలయంలో

నేడు వినతుల స్వీకరణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని చిత్తూరు ఎమ్మెల్యే వారి కార్యాలయంలో ప్రజాదర్బార్‌లో భాగంగా ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తేదీ శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు నియోజకవర్గ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు చెప్పారు. ప్రజలు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాన్ని జత చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని సంబంధిత శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

నేడు జిల్లాకు మంత్రి రామానాయుడు రాక

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈనెల 16న శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా పర్యటనలో భాగంగా మంత్రి 16న రోడ్డు మార్గంలో అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి నుండి బయల్దేరి సాయంత్రం 4.30 గంటలకు చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గంలోని హంద్రీ నీవా, కుప్పం బ్రాంచ్ కెనాల్‌లో 49.50 కి.మీ వద్ద కాలువ నిర్మాణ పనులను పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు కుప్పం నియోజకవర్గంలో పాలార్ నదిపై నిర్మిస్తున్న డబుల్ లెవెల్ రోడ్ బ్రిడ్జ్ పనులను పరిశీలిస్తారన్నారు. 5.30 గంటలకు రోడ్డు మార్గంలో తమిళనాడులోని జోలార్‌పేట రైల్వే జంక్షన్ చేరుకుని విజయవాడ బయల్దేరి వెళతారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

పీఈఎస్ వేదికగా

10వ రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పీఈఎస్ పబ్లిక్ పాఠశాల వేదికగా పదవ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బాస్కెట్ బాల్ పోటీలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ బాస్కెట్ బాల్ పోటీలు ఈనెల 15వ తేదీ నుండి 18వ తేదీ వరకు నాలుగు రోజులు పాటు జరుగుతాయి. ఈ పోటీలకు ఈస్ట్ గోదావరి, వెస్ట్ గోదావరి, కృష్ణ, గుంటూరు, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, ఒంగోలు తదితర జిల్లాల నుండి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్, రాష్ట్ర బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చెంగల్రాయ నాయుడు, ఏపీ టెక్నికల్ కమిటీ ఛైర్మన్ సురేష్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, డిఎఫ్ఓ ధరణి, బాస్కెట్ బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎన్‌పీ.జయప్రకాష్, డిఎస్‌డిఓ బాలాజీ, పీఈఎస్ పబ్లిక్ పాఠశాల డైరెక్టర్ కుమారస్వామి నాయుడు, ప్రిన్సిపాల్ వైవి.కృష్ణ బాబు పాల్గొన్నారు.

డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం కొరకు దరఖాస్తులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వెంకటగిరిలో గల ఎస్‌పికెఎం ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్ లూమ్ టెక్నాలజీలో 53 సీట్లకు, తమిళనాడు సేలంలో 12 సీట్లకు, కర్ణాటకలోని గడగ్‌లో 4 సీట్లకు 3 సంవత్సరాల హ్యాండ్ లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం కొరకు దరఖాస్తులు ఆహ్వానించబడుచున్నవని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్హతలు 10వ తరగతి లేదా తత్సమానమైన పరీక్షలలో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. బిసి, జనరల్ కేటగిరీ వారికి జూలై 1వ తేదీ నాటికి 15 నుండి 23 సంవత్సరాలు మధ్య వయసు, ఎస్‌సి, ఎస్‌టి వారికి 25 సంవత్సరాల వరకు వయసు ఉన్న వారు అర్హులుగా పేర్కొన్నారు. మూడు సంవత్సరాల కోర్సులో ఇంటర్మీడియట్ ఎంపిసి, ఇంటర్మీడియట్ ఒకేషనల్ (టెక్స్‌టైల్స్), ఐటిఐ (2 సంవత్సరాలు) కోర్సులలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు నేరుగా 2వ సంవత్సరాల్లో ప్రవేశం కొరకు దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. ఇతర వివరాలకు వెబ్‌సైట్‌ను చూడవచ్చు అన్నారు. అప్పరెల్, గార్మెంట్స్ మేకింగ్ టెక్నాలజీలో ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందని, అభ్యర్థులు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో సూచించారు.

మినీ అంగన్వాడీలకు వేసవి సెలవులు ఇవ్వాలి

ఐసీడీఎస్ పీడీకి సిఐటియు వినతి



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం మినీ అంగన్వాడీలకు వేసవి సెలవులు ఇవ్వాలని, అలాగే మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా చేయాలని గురువారం ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు జిల్లా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు ఐసీడీఎస్ పీడీకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎండలు తీవ్రత రోజురోజుకీ పెరుగుతున్నది. జిల్లాలో కూడా తీవ్రమైన ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. అన్ని రకాల విద్యాసంస్థలకు సెలవులు ఇచ్చినప్పటికీ చిన్నపిల్లలు ఉంటున్న అంగన్వాడీ సెంటర్లకు సెలవులు ఇవ్వడం దారుణమన్నారు. రెండు రకాల పనులు చేస్తూ జీతాలు కూడా తక్కువ తీసుకుంటున్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చి వేతనాలు పెంచాలని గతంలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మినీ వర్కర్లకు అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలని, సెకండ్ గ్రేడ్ సూపర్వైజర్ పోస్టులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం 20న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో అంగన్వాడీలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

రోగులతో స్నేహపూర్వకంగా మెలగాలి

జిల్లా వైద్య అధికారి డాక్టర్ సుధారాణి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: రోగుల పట్ల స్నేహపూర్వకంగా మెలగాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుధారాణి అన్నారు. గురువారం బంగారుపాళ్యం కమ్యూనిటీ హెల్త్ సెంటర్, తుంబకుప్పం ప్రాథమిక వైద్యకేంద్రంను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులతో స్నేహపూర్వకంగా వైద్యసేవలు అందించాలని, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి రోగికి సంబంధించిన సమాచారాన్ని ఈహెచ్‌ఆర్ (ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్)లో నమోదు చేయాలని, తద్వారా వారి సమాచారం వైద్యులకు త్వరగా అందుతుందని వారు చికిత్స సమాచారం ఉండడంతో వారికి చికిత్స చేపట్టడం సులభం అవుతుందని అన్నారు. అలాగే ఎన్‌సిడి సర్వే పారదర్శకత్వం చేయాలని సమస్యలు ఉన్న కేసులను వైద్యాధికారి ధ్రువీకరించిన తర్వాత తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స ఇప్పించి పర్యవేక్షణ చేపట్టాలన్నారు. మాతా శిశు సంరక్షణకు గర్భస్థ నమోదు నుంచే 1000 రోజులపాటు ఆరోగ్య సేవలను తూచా తప్పక ఇవ్వాలన్నారు. చంటి బిడ్డకు వ్యాధి నిరోధక టీకాలు డ్యూ డేట్ ప్రకారం తప్పక ఇవ్వాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా ప్రతి 15 రోజులకు ఒక్కసారి నీటి ట్యాంక్‌ను క్లోరినేషన్ చేయాలన్నారు. వీటన్నింటినీ తప్పక పాటిస్తే మన ఆరోగ్యం మన చేతుల్లో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఓ డాక్టర్ ప్రవీణ ,డాక్టర్ అనూష, జిల్లా టీం అధికారులు, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్ఓ సుధారాణి

లింగ నిర్ధారణ కట్టడి ఏదీ..?

- పిసిపిఎన్‌డిటి చట్టం అపహాస్యం
- యథేచ్ఛగా లింగ నిర్ధారణ పరీక్షలు
- నిద్రావస్థలో వైద్యశాఖ అధికారులు



డ్రగ్ కంట్రోల్ అధికారులు సీజ్ చేసిన సుధా మెడికల్స్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతోంది. ఆడబిడ్డల సంరక్షణ కోసం ప్రభుత్వం లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమంటూ పిసిపిఎన్‌డిటి చట్టాన్ని తీసుకొచ్చింది. స్కానింగ్ కేంద్రాలు, ప్రైవేటు నర్సింగ్ హోంలో గర్భిణీలకు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి పుట్టబోయే బిడ్డ ఆడ, మగ అనే విషయాన్ని తెలియజేస్తే చట్టపరంగా శిక్షలు ఉంటాయి. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు రుజువైతే అలాంటి స్కానింగ్ సెంటర్లను సీజ్ చేయడంతో పాటు అపరాధ రుసుం, జైలు శిక్ష తప్పదని పదేపదే ప్రచారం చేస్తున్నా జిల్లాలో చాటుమాటుగా లింగ నిర్ధారణ కేసులు వెలుగుచూస్తున్నాయి.

ప్రతి నెలా లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం అమలుపై జిల్లాస్థాయి కమిటీ సమావేశాలు నిర్వహిస్తూ కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్న కట్టడి చేయలేకపోతున్నారడానికి బుధవారం జిల్లా కేంద్రంలో వెలుగు చూసిన లింగ నిర్ధారణ స్కానింగ్ కేంద్రమే ఓ ఉదాహరణ. స్వయంగా జిల్లా ఎస్పీ, కలెక్టర్ డెకాయిట్ ఆపరేషన్‌లో పాల్గొన్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. జిల్లా కేంద్రమైన చిత్తూరులో యథేచ్ఛగా 11 సంవత్సరాలుగా భరత్ నగర్ కాలనీలో గుట్టుచప్పుడు కాకుండా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ కేంద్రం నడుస్తుంటే వైద్య ఆరోగ్య శాఖ పసిగట్ట లేకపోయారు. ఒక భరత్ నగర్ స్కానింగ్ కేంద్రంలోనే కాదు, జిల్లా అంతట ఇలాంటి అనధికార స్కానింగ్ కేంద్రాలు నడుస్తున్నాయని, ఇవన్నీ వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు తెలిసిన చూసిచూడనట్లు వ్యవహరిస్తూ వీరు నుండి మామూలు అందుకుంటున్నారనే విమర్శలు గుప్పుమంటున్నాయి.

తమిళనాడు, కర్ణాటక సరిహద్దు కావడంతో ఆ ప్రాంతాల నుండి లింగ నిర్ధారణ పరీక్షల కోసం గర్భిణీలు చిత్తూరుకు తీసుకొచ్చి లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. బుధవారం స్వయంగా జిల్లా కలెక్టర్ పాల్గొన్న డెకాయిట్ ఆపరేషన్లు చిత్తూరుకు చెందిన ముగ్గురు మహిళలు లింగ నిర్ధారణ పరీక్షల్లో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు పోలీసులకు విచారణలో తెలిసింది. ఎలాంటి అనుభవం లేని మెడికల్ షాప్‌లో సుదీర్ఘకాలం పనిచేసిన సునీత అనే మహిళ కీలక సూత్రధారిగా గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేసి జైలుకు పంపారు. మరో ఇద్దరి మహిళలను విచారిస్తున్నారు. ఈ కేసులో పోలీసు విచారణలో అందిన సమాచారం మేరకు గురువారం చిత్తూరు నగరంలోని కొన్ని గుడి వీధిలోని సుధా మెడికల్స్‌ను సీజ్ చేశారు. సునీతకు చెందిన వినోద్ ఫార్మసీని డ్రగ్ కంట్రోల్ అధికారులు తనిఖీ చేసి పిండస్త దశలోనే హతమార్చేందుకు ఉపయోగించి మందులను కనుగొన్నారు. ఇదే తరహాలో జిల్లావ్యాప్తంగా దాడుల నిర్వహిస్తే అనేక స్కానింగ్ సెంటర్లు చాటుమాటుగా నిర్వహిస్తున్న లింగ నిర్ధారణ దందా బయటపడే అవకాశాలు ఉన్నాయి. బుధవారం జిల్లా కేంద్రంలో తమిళనాడుకు చెందిన లింగ నిర్ధారణ ముఠా ఉదాంతం వెలుగు చూడటంతో జిల్లా కలెక్టర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయ అధికారికి నోటీసులు అందజేశారు. ఇకనైనా పిసిపిఎన్‌డిటి చట్టాన్ని ఏ మేరకు అమలు అయ్యేలా చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే...!



వినోద్ ఫార్మసీలో సోదాలు నిర్వహిస్తున్న డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ హరిప్రసాద్

ఏపీ ఆర్జేసీ పాలిసెట్ ఫలితాల్లో

ప్రతిభ ఎడ్యుకేషన్ అకాడమీ ప్రభంజనం

ప్రజాశక్తి- ఐరాల: ఏపీ పాలీసెట్ ఫలితాల్లో చిత్తూరు నగరంకు చెందిన ప్రతిభ ఎడ్యుకేషనల్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. బుధవారం రాత్రి విడుదలైన ఏపీఆర్జేసీ ఫలితాల్లో ఎంపీసీ విభాగం నుంచి పిడి ఉషారిక 150 మార్కులకు గాను 109 మార్కులతో 753వ ర్యాంకు సాధించింది. అదే విధంగా 91 మార్కులతో 2370, హారిక 85 మార్కులతో 3492 ర్యాంకు, హేమనాద్ 77 మార్కులతో 5385 ర్యాంకు, ఢిల్లీ ప్రసన్న 75 మార్కులతో 5961, అవినాష్ 72 మార్కులతో 7016 ర్యాంకులతో రాష్ట్రంలోని పలు ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి అర్హత సాధించారు. అదే విధంగా ఏపీ పాలీసెట్ ఫలితాల్లో ఎన్.యశ్విత 101 మార్కులతో 4250 ర్యాంకు, పిడి తుషారిక 100 మార్కులతో 4392, వాసవి 100 మార్కులతో 4468, ఢిల్లీ ప్రసన్న 90 మార్కులతో 8933, హారిక 86 మార్కులతో 11,456, రాకేష్ యాదవ్ 78 మార్కులతో 17, 200, హిందుప్రియ 74శాతం మార్కులతో 20,750వ ర్యాంకు సాధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి అర్హత సాధించారు. ఈ సందర్భంగా ప్రతిభ ఎడ్యుకేషన్ అకాడమీ ప్రిన్సిపాల్ యోగానంద మీడియాతో మాట్లాడుతూ గత 27 సంవత్సరాలుగా తమ అకాడమీలో రికార్డు స్థాయిలో విద్యార్థులు ఉత్తమ ర్యాంకుల సాధించి ఏపీఆర్జేసీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలు పొందుతున్నారని వెల్లడించారు. చిత్తూరు నగరం మిట్టూరులో నిర్వహిస్తున్న అకాడమీని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉత్తమ ర్యాంకులు సాధించాలని ఆయన కోరారు. ఉత్తమ ప్రతిభతో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అకాడమీ కరస్పాండెంట్ సి.మునీశ్వర్ రెడ్డి, డైరెక్టర్ డి.పద్మనాభరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ యోగానంద

ఇళ్ల నిర్మాణాలపై దృష్టి సారించండి

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్




టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ప్రధాన మంత్రి గ్రామీణ ఆవాస్ యోజన పథకం కింద జిల్లాలో ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలలో రూఫ్ లెవెల్, రూఫ్ క్యాస్ట్ లెవెల్‌లో ఉన్న గృహ నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పిడి గోపాల్ నాయక్ ను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వం ద్వారా మంజూరు చేసిన గృహాల నిర్మాణ పనుల పురోగతి పై గురువారం హౌసింగ్, డ్వామా, డిఆర్‌డిఏ పీడీలతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్ యోజన పథకం కింద చేపట్టిన గృహ నిర్మాణాలలో రూఫ్ లెవెల్, రూఫ్ కాస్ట్ లెవెల్‌లో ఉన్న గృహాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఇంటి నిర్మాణాల పురోగతిని తరచూ పరిశీలించాలని అన్నారు. ప్రతి మండలంలో ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు రూఫ్ లెవెల్, రూఫ్ లెవెల్ కాస్ట్‌లో ఉన్న గృహాల నిర్మాణాలను పూర్తిచేసేలా ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు, వార్డ్ అమినీటి సెక్రెటరీకి లక్ష్యాలను నిర్దేశించాలన్నారు. పూర్తి అయిన గృహనిర్మాణాలకు సంబంధించి బిల్లుల చెల్లింపు వేగవంతంగా జరుగుతున్నదని, పెండింగ్ బిల్లులను ఇంజినీరింగ్ అసిస్టెంట్ల ద్వారా త్వరగా అప్ లోడ్ చేయాలన్నారు. ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు యాక్టివ్ బెనిఫిషియారీలను గుర్తించాలని, బెనిఫిషియారీల ఫోన్ నెంబర్లను సేకరించి గృహ నిర్మాణ స్థితిగతులను కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షించాలన్నారు. గృహ నిర్మాణాలకు రెండు రోజులలో 10 గ్రామాలను పరిశీలించి మెటీరియల్ కాంపోనెంట్ కింద ఉపాధి హామీ ద్వారా చేపట్టే పనుల వివరాల నివేదిక డ్వామా పీడీ సమర్పించాలని, 90 రోజుల పని దినాల లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు గృహ నిర్మాణాల పూర్తికి స్వయం సహాయక సంఘాల ద్వారా అదనపు ఆర్థిక సహాయం అందించేలా డిఆర్‌డిఏ పీడీ చర్యలు చేపట్టాలన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో డ్వామా, డిఆర్‌డిఏ పీడీలు రవి కుమార్, శ్రీదేవి, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఏపిఓలు, హౌసింగ్ ఈఈ, డీఈ, ఏఈలు, ఇంగినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

స్థానిక సంస్థలకు అదనపు నిధులు ఇవ్వాలి

16వ ఆర్థిక సంఘం సమావేశంలో మేయర్ అముద



నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం ఇస్తున్న మేయర్ అముద

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఆర్థిక ఇబ్బందులతో ఉన్న పట్టణ స్థానిక సంస్థలకు అదనపు నిధులు కేటాయించాలని చిత్తూరు నగర మేయర్ ఎస్.అముద 16వ ఆర్థిక సంఘాన్ని కోరారు. గురువారం తిరుపతిలో 16వ ఆర్థిక సంఘం సభ్యులు డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్ అధ్యక్షతన పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎస్.సంపత్ కుమార్, తిరుపతి కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, మేయర్ ఎస్ అముద పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల్లో నిధుల నిర్వహణ, అభివృద్ధి పనులు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ప్రస్తుతం ఆర్థిక సంఘం ద్వారా అందజేస్తున్న నిధులు, చేపడుతున్న పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా చిత్తూరు నగర మేయర్ 16వ ఆర్థిక సంఘం సభ్యులకు స్థానిక సంస్థలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై వినతిపత్రం అందించారు. అర్బన్ లోకల్ బాడీలకు అమృత్ స్కీం రుణాలు, విద్యుత్ చార్జీలు పెనుభారంగా మారాయని, వీటిని తీర్చడానికి అదనపు నిధులు ఇవ్వాలని కోరారు. ఆర్థిక సంఘం విడుదల చేసే నిధులు నిర్దేశించిన పనులకే వినియోగించేలా చూడాలన్నారు. నీటి సరఫరా, వీధిలైట్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్ వంటి పనుల నిర్వహణ వ్యయం పెరిగిందని.. ఇందుకు తగినట్లు నిధుల కేటాయింపు పెంచాలన్నారు. విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించేలా సోలార్ ప్లాంట్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. వేసవిలో కరువు పరిస్థితుల నేపథ్యంలో నీటి సరఫరాకు అదనపు నిధులు కేటాయించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతో చేపట్టే పనులకు 80-90 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వమే విడుదల చేయాలన్నారు.

నిరుద్యోగ భృతి రూ.3వేలు ఎప్పుడిస్తారు?

- ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయి
- 'ఎఐవైఎఫ్' జాతీయ మహాసభలు ప్రారంభం



ప్రజాశక్తి - తిరుపతి సిటి

'ఎన్నికల ముందు నిరుద్యోగ భృతి రూ.3వేలిస్తానని ప్రకటించిన చంద్రబాబునాయుడు, అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఊసే లేదని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రగల్భాలు పలికిన మోడీ, పదేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలి' అని వక్తలు డిమాండ్ చేశారు. ఎఐవైఎఫ్ జాతీయ మహాసభలు తిరుపతి వేదికగా గురువారం ప్రారంభమయ్యాయి. సాయంత్రం తిరుపతి ఇందిరా మైదానంలో బహిరంగసభ జరిగింది. ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విచ్చేశారు. ఎఐవైఎఫ్ జాతీయ అధ్యక్షులు సికిందర్ సింగ్ మహేశ్వరి అధ్యక్షతన బహిరంగసభ జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన వక్తలు మాట్లాడుతూ ఉపాధి హక్కును ప్రాథమిక హక్కుగా చేర్చాలని డిమాండ్ చేశారు. భగత్‌సింగ్ జాబ్‌గ్యారంటీ యాక్ట్‌ను తక్షణం అమలు చేయాలన్నారు. విద్యార్థి నిరుద్యోగ వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న నరేంద్ర మోడీని సాగనంపేందుకు యువత నడుం బిగించాలని కోరారు. 'సేవ్ ఇండియా ఛేంజ్ ఇండియా' పేరుతో దేశవ్యాప్తంగా బలమైన ఉద్యమాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. రాజ్యసభ సభ్యులు సంతోష్‌కుమార్, ఎఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలరామన్, రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్రబాబు పాల్గొన్నారు. ఎఐవైఎఫ్ జాతీయ మహాసభలు తిరుపతిలో నాలుగు రోజుల పాటు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జాతీయ ఆఫీస్ బేరర్స్ వలి ఉల్లా కాదని, ఖాదర్, సిన్హా ప్రతాప్ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి హరినాథ్ రెడ్డి, జి ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

పెరియార్ చిత్రపటాలు తొలగింపు గర్హనీయం

'దక్షిణాసియా దేశాలపై ట్రంప్ పెత్తనమేంటి?' అని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రశ్నించారు. ట్రంప్‌కు భారత ప్రధాని తలొగ్గి వ్యవహరించడాన్ని తప్పుబట్టారు. సిపిఐ కార్యాలయంలో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతి నగరంలో ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల సందర్భంగా తిరుపతి నగరంలో పెరియార్ సిద్ధాంతంతో కూడిన చిత్రపటాలను ఏర్పాటు చేస్తే పోలీసులు వాటిని తొలగించడం శోచనీయం అన్నారు. పెరియార్ ద్రవిడ ఉద్యమానికి, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం చంద్రబాబుకు బాగా తెలుసునని ఈ విషయమై తక్షణమే స్పందించాలని కోరారు.

టెంపుల్ టూరిజంకు చర్యలు: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలోని పర్యాటక ప్రదేశాలలో పర్యాటకులకు అవసరమైన వసతుల ఏర్పాటుపై పర్యాటక శాఖ అధికారులు దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లా పర్యాటక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే వారితో చర్చించి పర్యాటక ప్రాజెక్టుల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఇందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న పర్యాటక ప్రదేశాలలో పర్యాటకులకు అవసరమైన సదుపాయాలలో భాగంగా వసతి, షాపింగ్ కాంప్లెక్స్, టాయిలెట్స్, ఇతరత్రా సౌకర్యాల ఏర్పాటుపై దృష్టి పెట్టాలన్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ఒక నెలలోపు సిద్ధం చేయాలని పర్యాటకశాఖ అధికారులను ఆదేశించారు. మొగిలి దేవస్థానం ఆలయం అభివృద్ధికి చర్యలు చేపట్టడంలో భాగంగా ఇందుకు అవసరమైన డిపిఆర్‌లను సిద్ధం చేయాలన్నారు. కుప్పంలో ననియాల ఎకో టూరిజం, కంగుంది, పాలారు రివర్ ప్రాంతాలలో అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. అలాగే కాణిపాకం, బోయకొండ దేవస్థానాలలో పర్యాటక రంగం అభివృద్ధికి గాను ప్రసాదం స్కీం కింద అవసరమైన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపడం జరిగిందన్నారు. జిల్లాలో రానున్న కాలంలో పర్యాటక రంగ అభివృద్ధికి అవసరమైన భూమి కేటాయింపులకు సంబంధించి పర్యాటక శాఖ రెవెన్యూ శాఖ సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. అటవీ శాఖకు అనుసంధానంగా ఉన్న ప్రాంతాలలో ఎకో టూరిజం అభివృద్ధికి అటవీశాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. డిఎఫ్ఓ భరణి, పర్యాటకశాఖ రీజినల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, పిఆర్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా పర్యాటక శాఖ అధికారి గౌరీ, జిల్లా దేవాదాయశాఖ అధికారి చిట్టెమ్మ, చిత్తూరు ఆర్‌డిఓ శ్రీనివాసులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అర్హత ఉన్నా.. అందని పింఛన్



ప్రజాశక్తి - ఎస్ఆర్‌పురం: అర్హతలు ఉన్నాయి కానీ పింఛన్ అందక అర్హులైన వారు ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భర్తను కోల్పోయిన మహిళలకు ఆ నెలలోనే పింఛన్ అందించాలని దిశా నిర్దేశం చేశారు. అయితే మండలంలో ఇంతవరకు వితంతువులకు పింఛన్ అందలేదు, ఎప్పుడు అందుతుందో అని ఎదురుచూస్తున్నారు. చివరికి ఎదురుచూపులే మిగిలాయని స్థానికులు వాపోతున్నారు. రాష్ట్రంలో సామాజిక పింఛన్లు మంజూరు ఏడాదిగా నిలిచిపోయింది. గత ప్రభుత్వం నవశకం పథకంలో భాగంగా ప్రతి సంవత్సరం జనవరి, జూలై నెలలలో కొత్తవారికి పింఛన్లు మంజూరు చేస్తూ వచ్చింది. అయితే ఈ ఏడాది జనవరిలో పింఛన్లు మంజూరు చేయకుండా దరఖాస్తులన్నిటిని పెంటింగ్‌లో పెట్టడం జరిగింది. దీంతో అర్హులైన వారు పింఛన్ కోసం ఎదురుచూస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుదారులకు ఎన్నికల ముందు అవకాశం ఇప్పిస్తారని భావించిన అలా జరగలేదు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం అయినా ఇంతవరకు పెండింగ్లో ఉన్న పింఛన్లను అనుమతించలేదు, కొత్తగా పింఛన్లు దరఖాస్తులను కూడా స్వీకరించడం లేదు.

గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిధిలో ఎస్ఆర్ పురం మండలంలో 23 గ్రామ పంచాయతీలు 13 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఈ పంచాయతీల నుంచి పింఛన్ల కోసం ఆన్లైన్లో అప్లై చేసుకున్న అర్హులైన వారు 692 మంది ఉన్నట్లు ఎంపీడీవో ఆఫీస్ రికార్డులు చెపుతున్నాయి. ఇంకా ఆన్లైన్లో అప్లై చేయని అర్హులైన వారు ఎంతమంది ఉన్నారో తెలియదు. కూటమి ప్రభుత్వం ఎవరైనా ప్రమాదవశాత్తు లేదా అనారోగ్యంతో మృతి చెందితే అలాంటి మహిళలకు అదే నెలలోనే లేదా మరుసటి నెలలో వితంతు పింఛన్ అందించాలని కూటమి ప్రభుత్వం అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అయితే ఇంతవరకు ఎవరికి పింఛన్లు అందలేదని ఆన్లైన్లో అప్లై చేసుకున్న వారు చెబుతున్నారు. కొత్త వారికి మంజూరు ఇవ్వకపోవడంతో దరఖాస్తులు పెట్టుకున్న వారు ఆర్థిక చేయూత లేక ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు నిత్యం కార్యాలయాలు, రాజకీయ నాయకుల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు.

మండలంలో 13 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. మండలంలో అర్హులైన వృద్ధాప్యం వితంతువులు, ఒంటరి మహిళ దివ్యాంగులు, డప్పు కళాకారులు ట్రాన్స్‌జెండర్ కూడా పింఛన్ల కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్నారు. వారి వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీ పురం గ్రామ సచివాలయంలో 55 మంది, కటికపల్లి గ్రామ సచివాలయంలో 64, కొత్తపల్లి గ్రామ సచివాలయంలో 77, ముద్దికుప్పం గ్రామ సచివాలయంలో 25, నెలవాయి గ్రామ సచివాలయంలో 94, పద్మాపురం సచివాలయంలో 36, పిల్లారిగప్పం గ్రామసచివాలయంలో 39, పుల్లూరు గ్రామ సచివాలయంలో 50, ఎస్ఆర్ పురం గ్రామ సచివాలయంలో 76, శెట్టివానాతం గ్రామ సచివాలయంలో 43, టయ్యూరు గ్రామసచివాలయంలో 62, వివిపురం గ్రామ సచివాలయంలో 46, వెంకటాపురం గ్రామ సచివాలయంలో 25, మండలంలోని 13 సచివాలయాలు కలసి మొత్తం 692 మంది అర్హులైన పింఛనుదారులు ఆన్లైన్లో అప్లై చేశారు కానీ వారికి నేటికీ పింఛన్ అందలేదు. రాష్ట్ర ప్రభుత్వం అందించే పింఛను అందితే ఏంతో కొంత కుటుంబ పోషణకు ఉపయోగపడుతుందని వారు అంటున్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అర్హులైన వారికి న్యాయం చేయాలని కోరుతున్నారు.

డిప్యూటీ సీఎంకు ఎదురు తిరిగానని పింఛను ఆపేశారు
- బి.అమృతమ్మ, చేకూరివారియిండ్లు, వివిపురం



నా భర్త మునుస్వామి నాయుడు అనారోగ్యంతో 2023 అక్టోబర్ 2వ తేదీ మరణించారు. నేను వితంతువు పింఛన్లకు అర్హురాలిని. అప్పటి డిప్యూటీ సీఎం నారాయణస్వామి గడపగడపకు కార్యక్రమంలో భాగంగా మా ఇంటికి వచ్చారు. ఎదురుగా అప్పటి ప్రతిపక్ష నాయకుడు నేటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో నా కుమారుడు కలిసి ఉన్న ఫోటో గోడకు కనిపించడంతో ఆయన మాట తీరు మారింది. మాటమాట పెరిగింది. నాకు అర్హత ఉన్నప్పుడు పింఛన్ ఎందుకు ఇవ్వరని నిలదీశాను దీంతో అప్పటి నుంచే ఇబ్బందులు పెట్టారు. ఇందులో భాగంగానే నాకు పింఛను ఆపేశారు అప్పటి నుంచి నేటికీ నాకు వితంతు పింఛన్ రావడం లేదు.

పింఛను కుటుంబానికి భరోసా
- లక్ష్మి, కొత్తపల్లి గ్రామపంచాయతీ, ఎస్ఆర్ పురం



నా భర్త పేరు ఆర్ముగం. ఆయనకు ఆరోగ్యం సరిగా లేక మంచానికే పరిమితమై ఉండటంతో గత ప్రభుత్వంలో రూ.5 వేలు పింఛను మంజూరు చేశారు. అనారోగ్యంతో నా భర్త మృతి చెందారు. నాతో పాటు నా కూతురు చిన్నపాప ఉంది. నాకు వ్యవసాయ చేయాలన్న భూములు లేవు, జీవనాధారం ఏమీ లేదు. నా భర్తకు వచ్చే పింఛను నాకు ఇప్పిస్తే మా కుటుంబ పోషణకు ఉపయోగపడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం మా కుటుంబానికి పింఛన్ అందించి భరోసా కల్పించాలని కోరుకుంటున్నాం.

ఉత్తర్వులు అందిన వెంటనే దరఖాస్తులు స్వీకరిస్తాం
- మోహన్ మురళి, ఎంపీడీవో



మండలంలో అర్హులైన వృద్ధాప్యం, వితంతువులు, ఒంటరి మహిళ, దివ్యాంగులు,డప్పు కళాకారులు, ట్రాన్స్‌జెండర్స్ కూడా పింఛన్ల కోసం దరఖాస్తులకు అవకాశం కల్పించాలని కోరుకుంటున్నారు. దరఖాస్తు చేసుకొని పెండింగ్‌లో ఉన్న వారికి కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి అనుమతి ఇచ్చే విషయంపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి మాకు ఉత్తర్వులు అందిన వెంటనే దరఖాస్తులు తీసుకొని పింఛన్లు అందిస్తాం. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఆర్ పురం మండలంలో అర్హులైన పింఛనుదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ప్రతినెల 6270 మందికి రూ.2,69,89,000లు అందిస్తోంది.

హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మూడు మండలాల అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీలు ఉన్న హెల్పర్ (ఆయా) పోస్టులకు అర్హులైన అభ్యర్థినులు దరఖాస్తులు చేసుకోవాలని సిడిపిఓ వినతశ్రీ కోరారు. మండలంలోని తిరువీధి కుప్పం (ఓసిలకు), కోటాగరం (ఎస్సీలకు), కలిజ వేడు(ఓసిలకు), పెనుమూరు మండలంలోని బలిజపల్లె హెల్పర్ పోస్టు (ఓసీలకు), పాలసముద్రం మండలంలోని క్రిష్ణజిమ్మా పురంలో హెల్పర్ పోస్ట్ (ఓసిలకు) కేటాయించారని వివరించారు. ఈనెల 16 నుంచి 24వ తేదీ లోగా అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ పోస్టులకు దరఖాస్తులుచేసే వారు పదో తరగతి పాసై, స్థానికులుగా ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థినులైతే తహశీల్దార్ వద్ద కులం సర్టిఫికెట్ పొందాలన్నారు. విద్యార్హత, కులం సర్టిఫికెట్లు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలపై గెజిటెడ్ అధికారి సంతకం చేసి దరఖాస్తులు అందజేయాలని ఆమె కోరారు.

బైరెడ్డిపల్లి: ఐసిడిఎస్ ప్రాజెక్ట్ బైరెడ్డిపల్లి పరిధిలో అంగన్వాడీ కేంద్రాల్లో హెల్పర్లు (ఆయాలకు) పోస్టులు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని ఐసిడిఎస్ సిడిపిఓ అరుణశ్రీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలో ఎస్టి కేటగిరి సంబంధించి ఒకటి, వీకోట మండలంలోని గాండ్లపల్లి పాపేపల్లి గ్రామాల్లో ఓపెన్ కేటగిరీలో అంగన్వాడీ సహాయకురాళ్ల పోస్టులు భర్తీ కొరకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. అర్హత కలిగిన వారు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ బైరెడ్డిపల్లి కార్యాలయంలో ఈనెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి సిడిపిఓ తెలిపారు.

తాగునీటి బోర్ ప్రారంభం



బోరును ప్రారంభిస్తున్న ఎంపీపీ యువరాజ్

ప్రజాశక్తి- వి కోట: మండల పరిధిలోని చింతమాకులపల్లి పంచాయతీ కుదవగడ్డ గ్రామంలో నూతనంగా వేసిన తాగునీటి బోర్‌ను ఎంపీపీ యువరాజు గురువారం ప్రారంభించారు. గ్రామంలో తాగునీటి సమస్య నెలకొనడంతో గ్రామస్తుల విన్నపం మేరకు తాగు నీటి కోసం బోరు వేసి మోటర్ బిగించారు. అదేవిధంగా పంచాయతీ ద్వారా నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సింగల్ విండో మాజీ ఛైర్మన్ గోపిరెడ్డి, సర్పంచ్ రాంచంద్రప్ప పాల్గొన్నారు.

డెంగీ దినోత్సవ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిఎం అండ్ హెచ్ఓ సుధారాణి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఛాంబర్‌లో గురువారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా బ్యానర్, వాల్ పోస్టర్లను డిఎం అండ్‌హెచ్ఓ డాక్టర్ డిటి సుధారాణి ఆవిష్కరించారు. ఈసందర్భంగా డిఎం అండ్‌హెచ్ఓ మాట్లాడుతూ శుక్రవారం అన్ని సచివాలయాల్లో డెంగీ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ అనూష, డాక్టర్ అనిల్, రామకృష్ణ, శివ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాల పంపిణీలో పారదర్శకత ఉండాలి

సర్వ శిక్ష అభియాన్ పీవో



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: పుస్తకాల పంపిణీలో పారదర్శకత ఉండాలని సర్వశిక్ష అభియాన్ పీవో వెంకటరమణ నాయుడు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాబోవు విద్యా సంవత్సరానికి సంబంధించి పంపిణీ చేపడుతున్న పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలస్థాయి నుంచి పంపిన సమాచారం మేరకు అచ్చు పుస్తకాలు నోట్స్‌లను రాష్ట్ర ప్రభుత్వం అందించిందని ఇది గ్రామస్థాయిలో విద్యార్థులకు చేర్చాల్సిన బాధ్యత విద్యాశాఖపై ఉన్నదని పారదర్శకంగా పంపిణీ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి 2 రమేష్ బాబు, ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర, ఉపాధ్యాయులు జగదీష్, సిఆర్పిలు పాల్గొన్నారు.

భూ దానానికి రూ.25వేలు విరాళం



ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం పట్టణంలో వెలసిన శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ దేవాలయ భూ దానం కార్యక్రమానికి టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు రూ.25వేలు నగదు విరాళాన్ని దేవాలయ ఆవరణలో కమిటీ అధ్యక్షులు బిఎంకె.రవిచంద్రబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం ప్రజలను రక్షిస్తూ, భక్తుల పాలిట కొంగు బంగారంలా వెలసిన అమ్మవారి జాతర సందర్భంగా భక్తాదుల సౌకర్యార్థం ఆలయ కమిటీ కొంత భూమిని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఇందుకోసం తన వంతు బాధ్యతగా రూ.25 వేలు అందించడం ఆనందంగా ఉందన్నారు. నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, రాజారామ్, మంజునాథ్, గోపినాథ్, మణిగోపాల్, కదిరిప్ప, బాలాజీ, బిజెపి ప్రభాకర్ పాల్గొన్నారు.

పది నెలలుగా వేతనం కోసం నిరీక్షణ

ప్రజాశక్తి- గంగవరం: గంగవరం మండల అభివృద్ధి కార్యాలయంలో గత 15 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న వాచ్మెన్ రామ లింగంకు గత పది నెలలుగా జీతం రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు. వాచ్మెన్‌గా తనకు వచ్చే జీతంతోనే సంసారం గడుస్తుందని, వేరే ఎటువంటి ఆదాయం లేదని జీతం రాక పది నెలలుగా జీవనం సాగించడం కష్టంగా ఉందని రామలింగం ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవోకి ఎంత మొరపెట్టుకున్నా కనికరించలేదని, సంబంధిత అధికారులు చొరవ చూపి జీతం ఇప్పించాలని కోరుతున్నాడు.

గంగమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



ప్రజాశక్తి- పలమనేరు: గంగ జాతర సందర్భంగా పలమనేరు ఎమ్మెల్యే ఎన్.అమరనాథ రెడ్డి గంగమ్మను దర్శించుకున్నారు. మొదట మారెమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం టీడీపీ నేతలతో కలసి గంగమ్మను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ ఎమ్మెల్యేను ఆలయ మర్యాదలతో సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు. బాలాజీ కోపరేటివ్ సూపర్ బజార్ వద్ద ఎమ్మెల్యే అన్నదానం చేశారు. నాయకులు ఆర్వీ బాలాజీ, విష్ణువర్ధన్‌రెడ్డి, కుట్టీ, గిరిబాబు, సోమశేఖర్ గౌడ్, నాగరాజు రెడ్డి, రాంబాబు, నాగరాజు, ఖాజా, జగదీష్ నాయుడు తదితరులున్నారు. అలాగే పలమనేరు మాజీ శాసనసభ్యులు వెంకటే గౌడ పట్టణంలోని జిలానీ సర్కిల్ నుండి పెద్ద ఎత్తున వైసిపి నాయకులతో కలిసి గంగమ్మకు సాంప్రదాయబద్ధంగా పట్టు వస్త్రాలు సారే సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గంగమ్మకి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శనం చేసుకున్నారు.

టీటీడీ ట్రస్ట్‌లకు భారీగా విరాళాలు

ప్రజాశక్తి - తిరుమల టిటిడి ట్రస్టులకు దాతలు భారీగా విరాళాలను అందించారు. దాత అమెరికా బోస్టస్‌కు చెందిన ఎన్ఆర్ఐ భాగవతుల ఆనంద్ మోహన్ టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడిని తన క్యాంపు కార్యాలయంలో కలిసి విరాళ డిడిని అందజేశారు. ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు కోటి వెయ్యి నూట పదహార్లు, ఎస్వీ గోసంరక్షణ ట్రస్టు, ఎస్వీ విద్యాదాన ట్రస్టు, ఎస్వీ వేద పరిరక్షణ ట్రస్టుకు, ఎస్వీ సర్వశ్రేయాస్ ట్రస్టుకు పది లక్షల వెయ్యి నూటపదహార్ల చొప్పున విరాళాన్ని దాత అందజేశారు. దాతను బిఆర్ నాయుడు అభినందించారు.

అధికారులు నిర్లక్ష్య ధోరణి వీడాలి: ఎంపీపీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి అమరావతి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: అధికారులు నిర్లక్ష్య ధోరణి విడాలని ఎంపీపీ అమరావతి అన్నారు. గురువారం ఇంచార్జ్ ఎంపిడిఓ శ్రీధర్ ఆధ్వర్యంలో మండల సర్వసభ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ అమరావతి మాట్లాడుతూ అటవీ శాఖ, రోడ్డు భవనాలు, ఆర్టీసీ, ఎక్సైజ్ శాఖలకు సంబంధించిన సిబ్బంది సమావేశానికి హాజరు కాకపోవడం చాలా దారుణమని అన్నారు. ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు మండల సర్వసభ సమావేశం ఎంతో కీలకమని గ్రామాల అభివృద్ధి జరగాలంటే మండలస్థాయి సమావేశాలు జరగాలని, ఈ సమావేశాలకు అధికారులు హాజరు కాకపోవడం ఆ సమస్యలపై చర్చించేందుకు సిబ్బంది లేకపోవడంతో ఆ సమస్యలు అలాగే కొనసాగుతున్నాయని అన్నారు. సమావేశం ప్రారంభమైన కొంతసేపటికే సభలో ప్రజాప్రతినిధులు లేక ఖాళీగా కుర్చీలు కనిపించాయని అన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి సోమశేఖర్, మండల ప్రత్యేక అధికారి ఆసిఫ్, తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, ఎంఈఓలు నాగేశ్వరరావు, రమేష్ బాబు, వ్యవసాయ అధికారి చిట్టిబాబు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


మహిళలు చేతి వృత్తుల్లో నైపుణ్యం సాధించాలి : పీడీ


మాట్లాడుతున్న చిత్తూరు డిఆర్డిఏ పీడీ శ్రీదేవి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: చేతి వృత్తులలో నైపుణ్యం సంపాదించడం ద్వారా ఆదాయం పొందుతూ మహిళలుగా ఆత్మస్థైర్యంతో జీవించవచ్చని డిఆర్డిఏ పీడీ శ్రీదేవి అన్నారు. గురువారం మండల కేంద్రమైన ఎస్ఆర్ పురం వెలుగు కార్యాలయము లో ఉచిత టైలరింగ్ శిక్షణా కేంద్రంను ఆకస్మికి తనిఖీ చేశారు. హాజరు పరిశీలించి టైలరింగ్ శిక్షణలో ఇప్పటివరకు వారు నేర్చుకున్న విధానాలను, శిక్షణలో కుట్టబడిన శాంపుల్ దుస్తులు పరిశీలించారు. టైలరింగ్ శిక్షణ మహిళలందరికీ స్వయం ఉపాధికి తోడ్పడుతుందని, శిక్షణ నందు ఎంబ్రాయిడరీ, టైలరింగ్ మొదలైన నైపుణ్యం పెంచుకోవాలని, శిక్షణకు సక్రమంగా హాజరై నైపుణ్యం పెంచుకున్న మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందిస్తామన్నారు. అలాగే ఎంబ్రాయిడరీ, ఫ్యాషన్ డిజైన్ లాంటి వాటిపై చిత్తూరులో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మహిళలు ఈ అవకాశాలను చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మోహన మురళి, ఏపిఎం రోజా, సీసీలు, ట్రైనర్ గీతా కుమారి, భాను, శిక్షణ పొందుతున్న మహిళలు పాల్గొన్నారు.

'నిఘా'తో దేశానికి రక్షణ

18న ఉపగ్రహ ప్రయోగానికి షార్ సిద్ధం



ప్రజాశక్తి-సూళ్లూరుపేట

భారతదేశ భద్రతే లక్ష్యంగా ఇస్రో మరో నిఘా ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధమవుతోంది. ఈనెల 18న శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం మొదటి ప్రయోగ వేదిక నుంచి ఈఓఎస్09 ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు. భారత్‌కు ఎంతో పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిన పోలార్ సాటిలైట్ లాంచ్ వెహికల్ (పిఎస్ఎల్వి) ద్వారా ఈ ఉపగ్రహ ప్రయోగం జరుపుతున్నారు. పిఎస్ఎల్వి -సి 61 పేరుతో రాకెట్‌ను నాలుగు దశలుగా నిర్మించారు. గత ఏడాది చివరిలో పిఎస్ఎల్వి -సి 60 రాకెట్ ప్రయోగం జరిగిన తర్వాత ఐన్నాళ్లకు మరో పిఎస్ఎల్వి రాకెట్ షార్ నుంచి ప్రయోగించనున్నారు. మధ్యలో ఇస్రో 100వ రాకెట్ జిఎస్ఎల్వి ఎఫ్ -15ను ప్రయోగించి ఉన్నారు. ఇదిలా ఉంటే సరిహద్దుల్లో ఇటీవల నెలకొన్న కొన్ని ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇస్రో ఈ నిఘా ఉపగ్రహం అవసరాన్ని గుర్తించి చక చకా ఏర్పాట్లతో ప్రయోగం చేసేందుకు సిద్ధమైంది. ఇక్కడ ఉన్న అన్ని రాకెట్ నిర్మాణ దశల సౌకర్యాలను ఉపయోగించుకుని పిఎస్ఎల్వి సి 61ని నిర్మాణపరంగా పనులు పూర్తి చేశారు. ఈ ఉపగ్రహ లక్ష్యం ఏదైనప్పటికీ ప్రస్తుతం అవసరమైన ఉపగ్రహం.దీనికి తగ్గట్లే ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ ఇటీవల ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఇస్రో ప్రయోగాల వలన దేశానికి రక్షణ సేవలు కూడా అందుతున్నాయని ప్రకటించి ఉన్నారు. ఇప్పటికే 10 ఉపగ్రహాలు అంతరిక్షం నుంచి తమ పని తాము చేసుకు పోతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఇఓఎస్ 09 పేరుతో ప్రయోగిస్తున్న భూ పరిశీలన ఉపగ్రహం కూడా అత్యంత శక్తివంతంగా సరిహద్దు ప్రాంతాలను అందులో ఉగ్రవాద కదలికలను పసిగట్టే సామర్థ్యం కలిగి ఉందని ఇస్రోవర్గాలు పేర్కొంటున్నాయి. వచ్చే ఐదేళ్లలో కనీసం 52 నిఘా ఉపగ్రహాలను భూ కక్షలోకి ప్రవేశపెట్టి భారతీయ రక్షణ రంగానికి విలువైన సేవలు అందిస్తామని ఇస్రోవర్గాలు తెలిపి ఉన్నాయి. ఈ ఉపగ్రహాలు శత్రువుల పనితీరును పసిగట్టేందుకు సరిహద్దులను పరివేక్షించేందుకు సైనిక కార్యకలాపాల సమయంలో త్రివిధ దళాలకు సాయపడేందుకు ఉపయోగపడతాయని ఇస్రోవర్గాల నుంచి సమాచారం. అందుకే ప్రస్తుతం ఉపగ్రహ ప్రయోగంపై దేశం మొత్తం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. మరోవైపు షార్ లో భద్రత ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఇటీవల సిఐఎస్ఎఫ్ దళాలు స్థానిక పోలీసుల సమన్వయంతో మాక్ డ్రిల్ నిర్వహించారు. యుద్ధ వాతావరణం ప్రస్తుతం లేదని భావిస్తున్న షార్ ను మరింత భద్రత కల్పించి కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. దేశ భద్రతను కాపాడు కోవాలంటే దేశంలోని 7వేల కిలోమీటర్ల సువిశాల సముద్ర తీర ప్రాంతాన్ని నిరంతరం పర్యవేక్షించాలని అత్యాధునిక ఉపగ్రహాల డ్రోన్ల సాంకేతిక పరిజ్ఞానం లేకపోతే అనేక వ్యూహాత్మక లక్ష్యాలను మనం చేరుకోలేమని ఇస్రో చైర్మన్ నారాయణ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈఓఎస్09 ఉపగ్రహం రీషాట్ 1బి సేవలు అందించనుంది. రీషాట్ 1 ఎ ఇప్పటికే ఉపగ్రహం అంతరిక్షం నుంచి మన దేశ రక్షణ కార్యక్రమాలు పర్యవేక్షిస్తుంది. ఎటువంటి వాతావరణం పరిస్థితులలో అయినా భూ ఉపరితలాన్నీ అత్యంత స్పష్టతతో కూడిన ప్రజల్యాషన్ ఫోటోలను తీసి పంపే సామర్థ్యం ఈ ఉపగ్రహానికి ఉంది. ఇందులో అమర్చిన సి బ్యాండ్ సింథటిక్ అపార్చ్ రాడార్ ప్రధాన ప్రత్యేకత కాగా, ఈ రాడార్ సాయంతో పగలు లేదా రాత్రి అనే తేడా లేకుండా సునిశిత విశ్లేషణ చేసే సామర్థ్యం ఈ ఉపగ్రహంలోని ఉపకరణాలకు ఉంది. కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ పార్లమెంటరీ స్థాయి సంఘం సభ్యులు ఉపగ్రహాన్ని ఉపగ్రహ ప్రయోగాన్ని వీక్షించేందుకు శ్రీహరికోటకు రానున్నట్లు తెలిసింది. ఈ ఉపగ్రహ ప్రయోగ ప్రాధాన్యత దష్ట్యా మరి కొంతమంది వీఐపీలు ఇస్రో చైర్మన్ తో పాటు ఇతర సీనియర్ శాస్త్రవేత్తలు రాకెట్ ప్రయోగ సమయంలో షార్ లోనే ఉండబోతున్నారు.

గాలివానకు నేలకూలిన చెట్లు




ప్రజాశక్తి- గంగవరం: మండలంలో బుధవారం రాత్రి గాలివానకు జాతీయ రహదారిలో భారీ వృక్షాలు నేలకొరిగాయి. గంగ్రాజుపల్లి పంచాయతీ నాలుగు రోడ్ల కూడలిలో ఇంటి ముందు నిలిపి ఉన్న సుమో కారు ధ్వంసం అయిందని, పక్కనే ఉన్న గవర్నమెంట్ సంబంధించిన కార్మికుల తరలించే బస్సుపై సమేతం భారీ వృక్షం పడడంతో బస్సు కూడా ధ్వంసమైందని స్థానికులు వాపోతున్నారు.

అమ్మవారి ఊరేగింపుకు అనుమతి ఇవ్వండి


ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం పట్టణంలోని రైల్వేగేటు మీదగా అమ్మవారి ఊరేగింపు చేయడానికి అనుమతులు ఇవ్వాలని రైల్వే అధికారులకు సాయిమాత సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు జగదీష్ బాబు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం పట్టణంలో వెలసిన శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా జరగడం ఆలవాయితీగా వస్తుందన్నారు. ఇందులో భాగంగా మంగళవారం నాడు అమ్మవారి శిరస్సు ఊరేగింపు జరగవలసి ఉండగా, ఈ ఊరేగింపు కొత్తపేట వెళ్ళుటకు 101వ నెంబరు రైల్వే గేటు దాటవలసి ఉన్నట్టు తెలిపారు. ఇందుకోసం రైల్వే నియమాలను సడలిస్తూ మంగళవారం రాత్రి అమ్మవారి శిరస్సు కొత్తపేట వెళ్ళుటకు, ఊరేగింపు అనంతరం పాతపేట వైపు వెళ్ళుటకు రైల్వే అధికారులు అనుమతులు ఇవ్వవలసిందిగా కోరుతూ బెంగళూరు డివిజన్ బంగారుపేట సెక్షన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ మహబూబ్ బాషాకు వినతి పత్రాన్ని అందించినట్టు తెలిపారు. అదేవిధంగా ఇటీవల అమ్మవారి జాతర సందర్భంగా కుప్పం మీద రాకపోకలు జరిపే రైళ్లను తాత్కాలికంగా నిలుపుదల చేయాలంటూ రైల్వే అధికారులను కోరినట్టు తెలిపారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన అధికారులు రైళ్ల నిలుపుదలకు అనుమతులు మంజూరు చేసినట్టు తెలిపారు. ఈ కర్పూరం బాబు, రైల్వే అధికారులు విజయ్ పాల్గొన్నారు.

టీడీపీ నేత సుబ్రీ జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి - రామకుప్పం: రామకుప్పంకు చెందిన టీడీపీ యువనేత, కుప్పం నియోజకవర్గ వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పివి.సుబ్రహ్మణ్యం (సుబ్రీ) జన్మదిన వేడుకలు గురువారం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు కేక్ కట్ చేసి పూల మాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. టీడీపీ నేతలు పద్మనాభ రెడ్డి, విజయ్ రెడ్డి, రామకృష్ణప్ప, రఘు, మురళి, అల్లి శీను, బాలు, సలాం సాబ్, అవినాష్, ఆదిల్, మంజునాథ్, వెంకటరమణ, రవి, చలపతి పాల్గొన్నారు.

వికసించిన మే పుష్పాలు



ప్రజాశక్తి- సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ బంగాళా గ్రామానికి చెందిన శివయ్య నాయుడు ఇంటిలో మే పుష్పాలు గురువారం వికసించాయి. ఈ సందర్భంగా శివయ్య నాయుడు మాట్లాడుతూ ప్రతి ఏడాది మే 15వ తేదీ తమ పెరటిలోని మే పుష్పాలు కచ్చితంగా వికసిస్తాయని అన్నారు. మే పుష్పాలు చూడడానికి పరిసర ప్రాంత ప్రజలు ఆసక్తి చూపారు.